TGTEL/25/A0977

# తొవ్వ

స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 347 | గురువారం 24-07-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. విచారణ పేరుతో వేధింపులు

**సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న ప్రభాకర్‌రావు**

**మధ్యంతర ఉపశమనం రద్దు దిశలో సిట్ అడుగులు**

**హైదరాబాద్, జూలై 23:** ఫోన్‌ట్యాపింగ్ కేసులో విచారణ పేరుతో సిట్ అధికారులు తనను వేధిస్తున్నారని పేర్కొంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించే దిశలో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. తనను పలుమార్లు విచారణ పేరుతో సిట్ కార్యాలయానికి పిలిపించారని, గంటల కొద్దీ కూర్చోబెట్టి, మానసికంగా వేధించారని ఆయన కోర్టుకు తెలియజేయనున్నట్లు సమాచారం. అదే సమయంలో.. సిట్ కూడా ప్రభాకర్‌రావు విచారణలో తమకు ఏమాత్రం సహకరించడం లేదని, ఆయనకు ఇచ్చిన మధ్యంతర ఉపశమనాన్ని రద్దుచేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్నట్లు తెలుస్తోంది.

## యూరియా బ్లాక్ మార్కెటింగ్ నియంత్రణలో సర్కారు విఫలం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

**హైదరాబాద్, జూలై 23:**
యూరియా బ్లాక్ మార్కెటింగ్‌ను అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. ఎరువుల డీలర్లపై సరైన పర్యవేక్షణ లేదన్నారు. యూరియా సరఫరా వ్యవస్థపై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం, ఫర్టిలైజర్ షాపులతో కొంత మంది కాంగ్రెస్ నేతలు కుమ్మక్కు కావడం వల్లే యూరియా కృత్రిమ కొరత తలెత్తుతుందని ఆయన చెప్పారు. మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పలు పార్టీల నుంచి కీలక నేతలు బుధవారం పార్టీలో చేరారు. వారందరికీ పార్టీ జెండాలు కప్పి రాంచందర్ రావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వ హయాంలో యూరియా కోసం రైతులు బారులు తీరి, లైన్లలో గొడవలు, లాఠీచార్జీలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. కానీ, మోదీ సర్కారు వచ్చిన తర్వాత కొరత లేకుండా యూరియా పంపిణీ చేస్తోందన్నారు. ప్రస్తుతం 9.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, 12.02 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసిందని ఆయన చెప్పారు. అంటే అవసరానికి మించి యూరియా సరఫరా చేసిందన్నారు.

## పీఎం కుసుమ్ అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి**

**న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 23:**



కేంద్ర ప్రభుత్వం పీఎం-కుసుమ్ పథకం కింద రైతులకు నిరంతరం తగిన ప్రోత్సాహాన్ని అందిస్తున్నప్పటికీ.. తెలంగాణలో ఈ పథకాన్ని అమలు చేయ డంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. వ్యవసాయ రంగంలో సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులపై భారం పడకుండా ఉంటుందనే ఉద్దేశంతో కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిందని చెప్పారు. అందులో భాగంగా రాష్ట్రంలో డి-సెంట్రలైజ్‌డ్ గ్రిడ్ అనుసంధానిత సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి అదనంగా 450 మెగావాట్ల సామర్థ్యంతో ఆమోదించామని తెలిపారు. దాంతో పాటుగా రాష్ట్రానికి 20 వేల సోలార్ అగ్రికల్చర్ పంప్‌సెట్లను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కేటాయించారని చెప్పారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని తెలంగాణ రైతులకు పీఎం-కుసుమ్ పథకం ప్రయోజనాలను అందేలా చూడాలని కిషన్‌రెడ్డి తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

## స్థానికతపై ఓ పరిష్కారంతో రండి

**వైద్య విద్య సీట్ల వ్యవహారంపై తెలంగాణ**

**సర్కారుకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం**



**న్యూఢిల్లీ, జూలై 23:**
మెడికల్ సీట్ల వ్యవహారంలో స్థానికత అంశంపై పరిష్కారంతో రావాలని.. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. లేనిపక్షంలో ప్రభు త్వం దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని జస్టిస్ కె వినోద్ చంద్రన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీల తో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం హెచ్చరించింది. ఈ నిబంధన వల్ల.. తెలంగా ణలో పుట్టి పదో తరగతి వరకు చదివినా స్థానిక కోటా దక్కడం లేదని ప్రతివాదుల తరపు న్యాయ వాదులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని సందర్భాల్లో తెలంగాణ వాసులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, పారామిలటరీ, ఇతర ప్రైవేట్ ఉద్యోగాల రీత్యా ఇతర రాష్ట్రాల్లో పనిచేయాల్సి వస్తోందని, దానివల్ల స్థానికత వర్తించక విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు.



# దంచి కొడుతున్న వానలు!

- ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరులో 23.4, ములుగు జిల్లా వెంకటాపురంలో 23.1 సెం.మీ.
- 12.30 గంటల వ్యవధిలోనే నమోదు
- అంతకుముందు 24 గంటల్లో వెంకటాపురంలో 25.8 సెం.మీ.. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం
- చేపలు పట్టేందుకు వెళ్లి ముగ్గురి గల్లంతు
- నేడు ఉత్తర తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు!

**హైద్రాబాద్, జులై 23 :**
నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు చోట్ల రోడ్లు తెగి రాకపోకలు స్తంభించగా.. పంటపొలాలు నీట ముని గాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. బుధవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలో అత్యధికంగా 23.4 సెం.మీ., ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో 23.1 సెం.మీ. నమోదైంది.

ఇటు మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు వెంకటాపురం మండలంలోనే 25.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక వర్షపాతం.. బుధవారం ములుగు జిల్లా మంగపేట మండలంలో 11.95 సెం.మీ., ఏటూరునాగారం మండలంలో 10.53 సెం.మీ, ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌లో 10.6, కౌటాలలో 10.3, భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో 9.82 సెం.మీ., వికారాబాద్ జిల్లా చిట్టంపల్లిలో 8.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ ముసురు వాన పడింది. ములుగు జిల్లాలో పలు చోట్ల చెరువు కట్టలు తెగిపోయాయి. దీంతో అప్రమత్తమైన జిల్లా అధికారులు లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. గోవిందరావుపేట మండలంలోని గుండ్లవాగు, జలగలంచవాగును పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పరిశీలించారు.

బొగత జల పాతం ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పర్యాటకుల సందర్శనకు అధికారులు అనుమతి నిలిపేశారు. భారీ వర్షానికి కరీంనగర్‌లో రోడ్లన్నీ వాగుల్ని తలపించాయి. బెజ్జూరు మండలంలో కురిసిన వర్షానికి కృష్ణపల్లి-సోమిని గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెన ఉప్పొంగి ప్రవహించడంతో అవతల ఉన్న గ్రామాలకు రాకపోకలు నిలిచిపో యాయి. కొత్తగూడెం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల నారచీరల ప్రాంతాన్ని గోదావరి వరద నీరు చుట్టుముట్టడంతో సీతమ్మ వారి విగ్రహంతోపాటు పరిసర లోతట్టు ప్రాంత దుకాణాలు నీట మునిగాయి. అలాగే పలు ప్రాంతాల్లో సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోగా.. కొన్నిచోట్ల అంతరాయం ఏర్పడింది. భూపాలపల్లి ఓపెన్ కాస్టు గనుల్లో నిలిచిన ఉత్పత్తి కారణంగా రూ.3 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. చేపల వేటకు వెళ్లి వేర్వేరు చోట్ల ముగ్గురు గల్లంతవ్వగా.. పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు. కరీంనగర్ సాలేహనగర్‌కు చెందిన సయ్యద్ సర్వర్ (55), తన తమ్ముడి కుమారుడు సయ్యద్ రిజ్వాన్ (20), మహమ్మద్ ఇసాక్ (33)తో కలిసి తిమ్మాపూర్ మండలంలోని లోయర్ మానేర్ డ్యాం(ఎల్ఎండీ)లో చేపల వేటకు వెళ్లారు. ఈ సమయంలో సయ్యద్ రిజ్వాన్ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోగా.. కాపాడేం దుకు పెద్దనాన్న సయ్యద్ సర్వర్ ప్రయత్నించి అతడితోపాటే నీటిలో మునిగిపోయాడు. మహబూ బాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బూరుగుగుంపులో చేపలు పట్టేందుకు వెళ్లి నరేశ్ (30) వాగులో గల్లంత య్యాడు. ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరుకు చెందిన తోటపల్లి వేణు (20) బైక్‌పై వెళు ్తుండగా పిడుగుపాటుకు గురయ్యాడు. దీంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

## రేషన్ కార్డులకూ సభలు పెట్టి గప్పాలు: కేటీఆర్



హైదరాబాద్, జూలై 23
చీకటి చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని, కాంగ్రెస్ అసమర్థ పాలనను చూశాక.. రాష్ట్రంలో గుర్రాలెవరో.. గాడిదలెవరో.. ప్రజలకు తెలిసిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మీ సేవా కేంద్రాల్లో ఇచ్చేసే రేషన్‌కార్డుల గురించి పెద్ద పెద్ద సభలుపెట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గప్పాలు కొడుతున్నాడని విమర్శించారు. ఆడబిడ్డలకు రూ.300కోట్ల మేర వడ్డీలేని రుణాలిచ్చి ఘనకార్యంలాగా కాంగ్రెస్ సంబరాలు చేసుకుంటోందని, కేసీఆర్ హయాంలో రూ.3000 కోట్ల దాకా వడ్డీలేని రుణాలిచ్చినా.. గొప్పగా చెప్పుకోలేదన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం వికారాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు పలువురు బుధవారం బీఆర్ఎసలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరిట అడ్డగోలు హామీల్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. కొందరు పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలా పని చేస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవడం ఖాయమని, అప్పుడు అధికారులందరూ సెట్ రైట్ అవుతారని, పార్టీ శ్రేణులను వేధించే పరిస్థితి ఉండదని అన్నారు.

## గ్రంథాలయాల్లో ఆంక్షలు.. దుర్మార్గం: హరీశ్



హైదరాబాద్, జూలై 23:
గ్రంథాలయాల్లోనూ నిషేధాజ్ఞల బోర్డులు పెట్టి.. విద్యార్థులు, నిరుద్యోగ యువతపై ఆంక్షలు విధించడం కాంగ్రెస్ దుర్మార్గానికి నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రశ్నించిన వారిపై ప్రభుత్వం పగబట్టినట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మొన్న యూనివర్సిటీల్లో ఆందోళనలు నిషేధిస్తూ మెమో ఇచ్చారని, ఇప్పుడు లైబ్రరీల్లో విద్యార్థులపై ఆంక్షలు పెట్టి ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో గ్రంథాలయాల చుట్టూ తిరిగి.. వాటిని రాజకీయ వేదికలుగా మార్చిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెసదేనన్నారు. రాహుల్‌గాంధీని సైతం లైబ్రరీకి తీసుకొచ్చి, బూటకపు హామీలిచ్చిన సంగతి మరిచిపోయారా? అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే అవి రాజకీయ వేదికలు కావని గుర్తొచ్చిందా? అని గురువారం 'ఎక్స్' వేదికగా నిలదీశారు. విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే.. రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీయడం తగదని అభిప్రాయపడ్డారు.

# 42 శాతం సాధిస్తాం

## కేంద్రం మెడలు వంచైనా తెస్తాం.. రైతు చట్టాల్నీ అలాగే రద్దు చేయించాం

**బీసీ రిజర్వేషన్లపై బీజేపీది ద్వంద్వ వైఖరి**

**ఉపరాష్ట్రపతి పదవిని దత్తాత్రేయకు ఇవ్వాలి**

**తెలంగాణ ప్రజల తరపున కేంద్రాన్ని కోరుతున్నా**

**ఢిల్లీలో మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి**



**న్యూఢిల్లీ, జూలై 23:** కేంద్రం మెడలు వంచైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో మూడు వ్యవసాయ నల్లచట్టాలు చేస్తే.. వాటిని ఉపసంహరించుకునేలా చేశామని గుర్తు చేశారు. తొలుత మొండికేసిన బీజేపీ ప్రభుత్వ మెడలు వంచి రద్దు చేయించామని అన్నారు. చివరికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ రైతులకు క్షమాపణలు చెప్పాల్సి వచ్చిందన్నారు. బుధవారం ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. "బీజేపీ వాళ్లు వితండవాదం చేస్తున్నారు. శాసనసభలో చర్చ జరిగినప్పుడు తీర్మానానికి బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ మద్దతు ఇచ్చాయి. ఓవైపు తెలంగాణలోని బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతు ఇస్తుంటే.. కేంద్ర బీజేపీ తాత్సారం చేస్తోంది. ఇక ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రాంచందర్‌రావు మాత్రం 'మీరెలా చేస్తారు? మీరు హామీ ఇచ్చుకుంటే మీరే చేసుకోండి' అని అంటున్నారు. లేదంటే ముస్లింలను రిజర్వేషన్ల నుంచి తొలగించండని వితండవాదం చేస్తున్నారు. ఇవాళ బీజేపీకి, కాంగ్రెసకు వేర్వేరు రాజ్యాంగాలు లేవు. అందరికీ అంబేద్కర్ రాజ్యాంగం ఒక్కటే. ఆ రాజ్యాంగానికి లోబడే రిజర్వేషన్లు పెంచాలంటున్నాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు. వందేళ్ల నుంచి వాయిదా పడుతూ వస్తున్న బీసీ రిజర్వేషన్లు, కులగణనను తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా పూర్తిచేసిందని తెలిపారు.

## ఆ విద్యార్థులను అనుమతించండి

**హైదరాబాద్ జూలై 23:** నీట్ పరీక్షకు ముందు నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలన్న నిబంధన పై తాజా విద్యా సంవత్సరం 2025కు సంబంధించిన అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో.. కోర్టుకు వచ్చిన అభ్యర్థులను ఎంబీబీఎస్ బీడీఎస్ వంటి కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించాలని హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గత విద్యా సంవత్సరం సైతం.. ఈ నిబంధనను సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. అప్పట్లో హైకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వం విధించిన నాలుగేళ్ల నిబంధనను కొట్టేసి, నివాస ధ్రువీకరణ పత్రం ఉన్న అభ్యర్థులందర్నీ స్థానికులుగానే గుర్తించి అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## బీఆర్ఎస్, బీజేపీ.. బీసీ వ్యతిరేక పార్టీలు

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్**




**హైదరాబాద్, జూలై 23 :**
బీజేపీ, బీఆర్ఎస్ బీసీ వ్యతిరేక పార్టీలుగా మారిపోయాయని, వాటిల్లోని బీసీ నేతలు ఆ పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెసతో జత కట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. అగ్ర కులాల పార్టీల ఆధిపత్యాన్ని ఎదిరించి కాంగ్రెస్ పార్టీ తో జతకట్టాలని మహేషకుమార్ గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్‌కు రాష్ట్రంలో బీఆర్ఎస్ మోకాలడ్డుతుండగా, అసెంబ్లీ ఆమోదంతో పంపిన బిల్లులను ఆమోదించేందుకు కేంద్రంలోని బీజేపీకి మనసొప్పడం లేదని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లంటే బీజేపీకి రుచించడం లేదని ఆరోపించారు. 9వ షెడ్యూల్‌లో చేర్చడం సాధ్యం కాదనుకుంటే అసెంబ్లీలో బీసీ బిల్లులకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎలా మద్దతిచ్చారు? బిల్లు ఢిల్లీకి వెళ్లాక ఎందుకు మాట మార్చారు? అని నిలదీశారు. బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తామని స్పష్టం చేశారు.

## మోదీ మౌనం అనుమానాన్ని పెంచుతోంది

**కాల్పులు విరమింపజేశానని ట్రంప్ పాతిక సార్లు అన్నారు**

**కానీ, మోదీ ఒక్కసారైనా స్పందించలేదు**

**ప్రధానిని చూస్తే ఏదో తేడా కొడుతోంది**

**ట్రంపే కాల్పులను ఆపించారు: రాహుల్**

**న్యూఢిల్లీ, జూలై 23:** భారత్-పాకిస్థాన్ మధ్య తానే కాల్పులు విరమింపజేశానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికి పాతిక సార్లు అన్నారని.. దీనిపై మోదీ ప్రభుత్వం ఎందుకు స్పందించదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నిలదీశారు. కాల్పులు విరమింపజేయడానికి ట్రంప్ ఎవరని ప్రశ్నించారు. దీనిపై ప్రధాని మోదీ ఒక్కసారి కూడా జవాబివ్వలేదంటే ఏదో తేడా కొడుతోందని వ్యాఖ్యానించారు. కాల్పుల విరమణ దిశగా మధ్యవర్తిత్వం నెరిపానని ట్రంప్ చెబుతూ ఉన్నా.. మోదీ మౌనం వహిస్తున్నారని..అమెరికా అధ్యక్షుడిగా విధేయుడిగా ఉండాలని అనుకుంటున్నారా అని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ప్రశ్నించారు. బుధవారం పార్లమెంటు ప్రాంగణంలో వారిద్దరూ మీడియాతో మాట్లాడారు. 'ట్రంప్ ఒకటికి పదిసార్లు నేనే యుద్ధాన్ని ఆపానంటూ భారత్‌ను అవమానిస్తుంటే మోదీ గట్టిగా స్పందించాలి. కానీ ఆయన మాట్లాడడం లేదు. ఇది ఆయన బలహీనతను సూచిస్తోంది' అని ఖర్గే అన్నారు. ప్రతిపక్షం డిమాండ్ చేసినట్లుగా ఈ అంశంపై పార్లమెంటులో ప్రధాని ప్రకటన చేయాలంటారా అని విలేకరులు అడుగగా.. ప్రధాని ఎలా ప్రకటన చేస్తారని రాహుల్ ఎదురుప్రశ్న వేశారు. 'ఆయనేం చెబుతారు? కాల్పుల విరమణ ట్రంప్ చేయించారని చెబుతారా? చెప్పరు. కానీ అదే కరెక్టు. మోదీ దాక్కోలేరు. ట్రంపే కాల్పులు ఆపించారు. యావత్ ప్రపంచానికీ ఈ వాస్తవం తెలుసు' అని అన్నారు. దేశంలో ఎన్నికలను దొంగిలిస్తున్నారని రాహుల్ మరోసారి ఆరోపించారు.



# అర్హులైన వారికి తెల్ల రేషన్ కార్డులు పంపిణీ

**రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి పేదవానికి సహాయం, - పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలి,**

**ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం, - డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్**

**తొవ్వ న్యూస్ ప్రతినిధి కురవి జూలై 23,**



అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డులు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇస్తుందని డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ అన్నారు. బుధవారం తొవ్వ న్యూస్ ప్రతినిధితో చరవాని లో ఎమ్మెల్యే మాట్లాడుతూ బిబినేడు ఉదయం చిన్నగూడూరు మండలంలో అర్హులైన వారికి తెల రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు, బి మధ్యాహ్నం మూడు గంటలకు కురవి మండల కేంద్రంలో తెల్ల రేషన్ కార్డులు పంపిణీ జరుగుతుందని అన్నారు. గత పది సంవత్సరాల నుంచి టిఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేద వర్గాల అందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో పేద మధ్యతరగతి ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉన్నంతకాలం పేద ప్రజలకు మధ్యతరగతి నిరుపేదలకు బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలతో పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రైతులకు రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా కల్పించినట్లు ఆయన తెలిపారు, మహిళలకు ఉచిత బస్సు రవాణా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, గ్యాసు, త్వరలో గృహలక్ష్మి, ఇస్తున్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి గ్రామపంచాయతీలలో మౌలిక వసతుల కల్పనకు పక్క ప్లాన్ తో ప్రభుత్వం ముందుకు వెళు _తుందని అన్నారు. గ్రామాలలో ఇందిరమ్మ గృహాలు స్పీడుగా నిర్మాణాలు అవుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉంటూ ఆశీస్సులు అంద చేయాలని ఆయన కోరారు,

# ఘనంగా వీరభద్రునికి రుద్రాభిషేకం

**అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు - అభిషేకం కొరకు ఆరు నదుల నుంచి జలాలు,**

**ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రావణపు సత్యనారాయణ,**

తొవ్వ ప్రతినిధి, కురవి జూలై 23,

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో కొలువై యున్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారికి ఏకాదశ వార రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రవణపు సత్యనారాయణ తెలిపారు. బుధవారం వీరభద్ర స్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని ఘనంగా మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకాన్ని వైభవ పేతంగ నిర్వహించారు. వీరభద్రుని ఆలయంలో భక్తులు పాయలి రాజేశ్వరరావు, యాదమ్మ దంపతులు తొలిసారిగా స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాన్ని పవిత్ర సప్త నదులు గంగ, యమునా, నర్మదా, సరస్వతి, కావేరి, కృష్ణ, గోదావరి నదుల నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాల తోటి వీరభద్రునికి జలాభిషేకం అత్యంత వైభవ వేతంగా అర్చకులు వేద మంత్రోత్సాహాల తోటి నిర్వహించారు. భక్తులు పాయిలి రాజేశ్వరరావు యాదమ్మ దంపతులను ఆలయ ఈవో ఘనంగా



సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రెడ్యాల శ్రీనివాస్. తాటికొండ పుణ్యమూర్తి. పూసకంటి విజయ్ కుమార్. పెనుగొండ అనిల్. బాలకృష్ణ శర్మ. రవితేజ శర్మ. మడికొండ విజయ్ కుమార్. ఊటుకూరు అభిలాష్ శర్మ. పెనుగొండ రమేష్. టీయూడబ్ల్యూజేఐజేయు జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్. ధర్మకర్త చిన్నం గణేష్. సిబ్బంది జగన్ చారి. సమ్మయ్య. నవీన్. లింగయ్య. భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘాల ఆద్వర్యంలో విద్యాసంస్థల బందు విజయవంతం

**ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మాగం లోకేష్,**

**జిల్లా కోశాధికారి మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాకేష్**




**తొవ్వ,గార్ల జూలై 23**

గార్ల మండల కేంద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంధు విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాఘం లోకేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాకేష్ పిడిఎస్యు జిల్లా కోశాధికారి మునగాల మహేష్ మాట్లాడుతూ నేడు తెలంగాణ రాష్ట్రంలో లిక్కర్ ఇచ్చిన ప్రాధాన్యత విద్యారంగం వైపు చూపెట్టని పరిస్థితి కనబడుతోంది. నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడుస్తోంది నేటికీ తెలంగాణ రాష్ట్రంలో విద్యా శాఖ మంత్రిని కేటాయించకపోవడం అనేది చాలా సిగ్గుచేటు. ఈ దేశానికి రేపటి భావి భారత పౌరులు విద్యార్థులే కాబట్టి వాళ్లకి కావాల్సినటువంటి మౌలిక సదుపాయాల్ని కల్పించాలన్న వారి సమస్యల పరిష్కారం కావాలన్నా విద్యాశాఖ మంత్రి అనే వాళ్ళు ఉండాలి. కానీ మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి దగ్గరనే విద్యాశాఖ విద్యాశాఖను పెట్టుకొని తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు పడుతున్న సమస్యలను పరిష్కరించకపోవడం అనేది చాలా బాధాకరమైన విషయం. నేడు రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న వారి మీద ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అదేవిధంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్నటువంటి ఎంఈఓ డీఈవో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి, అద్దె భవనాల్లో కొనసాగుతున్నటువంటి గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, మూతబడ్డ ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఓపెన్ చేయాలని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్నటువంటి ఎనిమిది వేల కోట్ల పైచీలకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానం 2020ని రద్దుచేసి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ నుండి తీర్మానం పంపాలని డిమాండ్ చేస్తున్నాం. విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని. పెండింగ్లో ఉన్నటువంటి మిస్ కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని గార్ల మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయాలని దూర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు ఎస్ ఎం హెచ్ హాస్టలను ఏర్పాటు చేసి విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉన్నటువంటి బీసీ బాలికల వసతి గృహం శిధిలా వ్యవస్థలో ఉండడం వలన ఈ వర్షాకాలంలో పెచ్చులు ఊడి కింద పడుతున్నయని,ఉన్నతాధికారులు బీసీ వెల్ఫేర్ అధికారి స్పందించి నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ జరగకుండా ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు సంతోష్ కిరణ్ ఉదయ్,భవాని,వంశి ,పృథ్వీరాజ్ చింటూ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

**ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి శరత్ - ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం**

తొవ్వ, కేసముద్రం, జూలై 23:

విద్యారంగ నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి శరత్ అన్నారు.బుధవారం కేసముద్రం మండలంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల, కల్వల టీఎస్ పాఠశాలలను తరగతులు బహిష్కరించి బంద్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి శరత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడుస్తున్న నేటికీ విద్యా శాఖ మంత్రిని కేటాయించకపోవడం అనేది చాలా బాధాకరమని, ఈ దేశానికి రేపటి భావి భారత పౌరులు విద్యార్థులే కాబట్టి వాళ్లకి కావాల్సినటువంటి మౌలిక సదుపాయాల్ని కల్పించాలన్న వారి సమస్యల పరిష్కారం కావాలన్నా విద్యాశాఖ మంత్రి అనే వాళ్ళు ఉండాలి కానీ మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి దగ్గరనే విద్యాశాఖ విద్యాశాఖను పెట్టుకొని తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు పడుతున్న సమస్యలను పరిష్కరించకపోవడం చాలా విచారకరమని అన్నారు. నేడు రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న వారి మీద ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, అదేవిధంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్నటువంటి ఎంఈఓ, డీఈవో, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూత బడిన ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఓపెన్ చేయాలని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్నటువంటి ఎనిమిది వేల కోట్ల స్కాలర్షిప్ ఫీజు, రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని, నూతన జాతీయ విద్యా విధానం 2020ని రద్దుచేసి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ నుండి తీర్మానం పంపాలని, విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని, రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ జరగకుండా ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు పర్యవేక్షించాలని, పెండింగ్లో ఉన్నటువంటి మిస్ కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ముదురకోల అనిల్, పవన్ కళ్యాణ్, తోట విగ్నేష్, నిరుటి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిపురం పాల సంఘం రద్దయినట్టు చేస్తున్న ప్రచారం సరికాదు

**సిరిపురం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు సిల్వర్ వెంకటయ్య**

**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: జూలై 23**



సిరిపురం పాల ఉత్పత్తిదారుల సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన నాపై కొంతమంది వ్యక్తిగత కక్ష దృష్టిలో పెట్టుకొని పాల సంఘం రద్దయిందని తప్పుడు ప్రచారం చేయడం తగదని బుధవారం సిరిపురం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు సిల్వేరు వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 30వ తేదీన ఎన్నిక జరిపి వచ్చిన ఎన్నికల అధికారి నియామక పత్రం ఇవ్వడం జరిగిందని దీనిపై నిన్న ఓ దినపత్రికలో పాలకవర్గం రద్దు అయినట్లు తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని, నాకు ఎలాంటి నోటీసులు రాలేదని పాలకవర్గం రద్దు కాలేదని తెలిపారు. మీడియాను తప్పు దోవ పట్టిస్తూ నిందారోపణ చేయడం సరికాదన్నారు. నా గెలుపును జీర్ణించుకోలేని కొంత మంది అడ్డంకులు సృష్టించినా రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తూ పాల సోసైటిని ముందుకు తీసుకెళ్తానని తెలియజేశారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మున్నేరులోకి ప్రజలు వెళ్లరాదు - తాసిల్దార్ పున్నం చందర్**

**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి జూలై 23,**

మహబూబాబాద్ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆకేరు వాగు కు పెద్ద ఎత్తున వరద వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రజలు, రైతులు ఎవరు వాగులోకి వెల్ల రాదని తాసిల్దార్ పున్నం చందర్ అన్నారు. బుధవారం సీరోలు మండలం పరిధిలోని మన్నెగూడెం దుబ్బ తండా. ఏటిగడ్డ, రేకుల తండా, తండాలలో ఆయన పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. రైతులు, ఇసుక రవాణా చేసేవారు, పశువులు, గొర్లు, మేకల, కాపర్లు, బట్టలు ఉతికేందుకు మహిళలు, ఎవరూ కూడా మున్నేరుకు వెళ్ళవద్దని ఆయన సూచించారు. జిల్లాలో ఆకేరు వాగుకు పైనుంచి వరద వస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, చేపలు పట్టేందుకు పిల్లలను వాగుకుకు వెళ్లకుండా చూడాలని గ్రామ ప్రజలను హెచ్చరించారు. వర్షాల వల్ల ఇబ్బందులు జరిగితే వెంటనే తాసిల్దార్ కార్యాలయం కు గాని పోలీస్ స్టేషన్ కు గాని సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. పోలీసులు రెవెన్యూ సిబ్బంది ఆకేరు వాగు పరిసర తండాలు గ్రామాలలో పర్యటిస్తూ ఉంటారని అన్నారు. తాసిల్దార్ వెంట రెవిన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఆరోగ్య కేంద్రాన్ని మార్చక అవస్థలు

**- ఆరు దాటితే అందని వైద్యం**

**- గర్భిణీ స్త్రీలకు,బాలింతలకు తప్పని తిప్పలు**

**- పట్టించుకోని పాలకులు,స్పందించని అధికారులు**

**తొవ్వ,కేసముద్రం, జూలై 23:**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మార్చక అవస్థలు పడుతూ నానా ఇబ్బందులకు గురవుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి నారాయణ పురం గ్రామం మండలాల విభజనలో భాగంగా పూర్వం నెల్లికుదురు మండలం నుండి కేసముద్రం మండలంలో విలీనం చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో నారాయణపురం గ్రామంలోని అన్ని ప్రభుత్వ శాఖలు కేసముద్రం మండలానికి మార్చడం జరిగింది కానీ ఒక్క వైద్య ఆరోగ్య శాఖ మాత్రమే నెల్లికుదురు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేటికీ కొనసాగుతూనే ఉందని గ్రామస్థులు వాపోయారు. గ్రామంలోని నిరుపేద ప్రజలకు ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే చికిత్సకోసం ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కేసముద్రం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వదిలి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లికుదురు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళవలసి వస్తుందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామంలోని బాలింతలు,గర్భిణీ స్త్రీలు,చిన్న పిల్లలు వృద్ధులు చికిత్సకోసం నెల్లికుదురు మండలంకి వెళుతూ అవస్థలు పడుతున్న సంఘటనలు తరుచు చూస్తూనే ఉన్నాం. ఆరు దాటితే చాలు నిరుపేదలకు ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే నెల్లికుదురు మండలానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాలకులకు నారాయణ పురం గ్రామానికి ఆరోగ్య ఉప కేంద్రం మంజూరు చేయాలని వినతులు సమర్పించిన పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఎన్నోసార్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నెల్లికుదురు మండలం నుండి కేసముద్రం మండలానికి మార్చాలని మొరపెట్టుకున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న తీరును చూసి స్థానికులు మండిపడుతున్నారు.

## భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**అర్పణ పల్లి వట్టి వాగు వద్ద పెరుగుతున్న వరద ఉధృతి**

**వరద ఉధృతిని పరిశీలించిన తాసిల్దార్ వివేక్, ఎస్ఐ కరుణాకర్**

తొవ్వ, కేసముద్రం, జూలై 23:



భారీ వర్షాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ జి. వివేక్ అన్నారు. బుధవారం ఎస్సై కరుణాకర్ తో కలిసి మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కేసముద్రం గూడూరు ప్రధాన రహదారి అర్పణ పల్లి గ్రామం వద్ద ఉన్న వట్టివాగు వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ఉధృతి భారీగా ప్రవహించేటప్పుడు పాదచారులు, వాహనదారులు వెళ్లకూడదని సూచించారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్ సిబ్బంది, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు

**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తొవ్వ ప్రతినిధి :జులై 23**

రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.సుభాష్ సెంటర్ లో కేకు కట్ చేసి కార్యకర్తలకు మిఠాయి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, నాయకులు పున్న రమేష్, మొహమ్మద్ నాసర్, గోదాస్ పృథ్వీరాజ్, మొహమ్మద్ రెహాన్ ,సాల్వేర్ లింగం, జిల్లా వెంకటేశం, కొత్తపల్లి అబ్రహం కుమార్, మొహమ్మద్ అక్రమ్, కోట సుధాకర్ ,బొడ్డు శంకరయ్య ,గురుకుశివ, బత్తుల నవీన్ కుమార్, కేశవదాసు వెంకటేశం, మీర్జా బషీర్ బేగ్, మొహమ్మద్ మన్సూర్ అలీ ,కొమ్ము శేఖర్, గొలుసుల ప్రసాద్, మేడి శంకరయ్య ,మహమ్మద్ మహబూబ్ అలీ మీర్జా, ఖదీర్ బేగ్ ,మొహమ్మద్ కరీం ,చింతల కృష్ణ మహమ్మద్ రిజ్వాన్ ,మొహమ్మద్ అజార్, కక్కినేని రవీందర్ ,మహమ్మద్ జానీ, గాదె నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేటలో కాలుష్య సిమెంట్ పరిశ్రమ నిర్మిస్తే మరో పోరాటం తప్పదు

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి :జులై 23**

రామన్నపేటలో ఆదాని అంబుజా సిమెంటు పరిశ్రమ నెలకొల్పితే మరో ప్రతిఘటనా పోరాటం తప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి సూర్యాపేట వెళుతున్న క్రమంలో స్థానిక రామన్నపేట సుభాస్ సెంటర్లో సిపిఎం మండల నాయకులను కలిసి ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశీయ బడా పెట్టుబడిదారునైనా ఆదాని సిమెంట్ పరిశ్రమ నెలకొల్పి పచ్చని పల్లెల్లో కాలుష్య భూతాన్ని పెంచి పోషించాలని చూస్తే కమ్యూనిస్టులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రజా అభిప్రాయ సేకరణలో మండల వ్యాప్తంగా ప్రజలు ముక్తకంఠంగా వ్యతిరేకించినా మళ్లీ దొడ్డి దారిన వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని. పోరాటాల పురిటి గడ్డ అయిన రామన్నపేట ప్రజలు మరోసారి తిరగబడి ప్రతిఘటిస్తారని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన రిపోర్టుని బహిర్గతం చేయాలని, వెంటనే సిమెంట్ పరిశ్రమను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని అన్నారు. పరిశ్రమ ఏర్పాటు చేయవద్దని, రాష్ట్ర ముఖ్యమంత్రిని త్వరలోనే కలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యుడు బల్గూరి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్, మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు, పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటపాటు శివకుమార్,డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు శానకొండ రామచంద్రం, మెట్టు శ్రవణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, ఆముద ఆంజనేయులు, భావనలపల్లి సత్యం,కునూరు గణేష్, రాసాల రమేష్, పొట్లచెరువు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిర్బంధాలతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరు

## ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్

**యాదాద్రి జిల్లా తో రామన్నపేట జూలై 23**

నిర్బంధాలతో ,అక్రమ కేసులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని ప్రభుత్వం అవలంబించే విద్యా వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తుందని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ అన్నారు. బుధవారం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల రాష్ట్ర వ్యాప్త బంద్ రామన్నపేటలో సంపూర్ణ బంద్ రామన్నపేట మండలంలో ఉన్న కళాశాల ,పాఠశాలలు స్వచ్ఛందంగా బందు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నెలల కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం జరగడంలేదని, కనీసం రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని కూడా కేటాయించలేదని అన్నారు. గత ఆరు సంవత్సరాల నుండి విద్యార్థులకు రావలసిన 8300 కోట్ల రూపాయల ఉపకార వేతనాలు, బోధన రుసుములను విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ విద్యార్థులను మోసగిస్తుందని అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడిలో విద్యార్థులపై పోలీసులు పాషవికంగా లాఠీ చార్జి నిర్వహించి అరెస్టు చేసి రాత్రి వరకు పోలీస్ స్టేషన్లో నిర్భందించడం అప్రజాస్వామికమని అన్నారు. బందు జరగకుండా విద్యార్థి నాయకులని అన్ని మండలాల్లో అరెస్టులు చేసి నా కూడా



విద్యార్థుల స్వచ్ఛందంగా బందు పాటించారని తెలియజేశారు. అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకురాలు పొట్లచెరువు గాయత్రి, నాయకులు భూక్య సంతోష్ నాయక్, బత్తిని సందీప్, తాటిపాముల ఉదయ్, యాదాసు చరణ్, గట్టు నరేష్, సిల్వర్ రమేష్, అక్షిత, వందన, నవదీప్, కొమ్ము నరేష్, శాంతి కుమార్, వల్లమల్ల నరేష్, యాదాస్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# జన వికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**తొవ్వ, నర్సింహులపేట, జులై. 23**

నరసింహుల పేట మండలంలోని వంతడుపుల గ్రామంలో బుధవారం రోజున జన వికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మెడికేర్ హాస్పిటల్ తొర్రూర్ వారి సహకారంతోటి ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో బాలవికాస ప్రతినిధులు కందునూరు సుకన్య గుగ్గిళ్ళ స్వర్ణలత మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పాటించవలెనని మురికి కుంటలు లేకుండా చూసుకోవాలని ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఈ సంవత్సరంలో బాలవికాస ఆధ్వర్యంలో తెలంగాణలోని 14 సెంటర్లలో రెండు వందల హెల్త్ క్యాంపులనునిర్వహించడంజరుగుతుందని అన్నారు బాలవికాస వ్యవస్థాపకులు అయినటువంటి బాల తెరె స్సా జింగ్రాస్ గారి నేతృత్వంలో అనాథ పిల్లలు వికాస పిల్లలు అనాథ వృద్ధులు చెట్ల పెంపకం పెరటి తోట పెంపకాలు హ్యాండీక్యాప్డ్ పిల్లలు వితంతు వివక్షత మహిళా సాధికారత మహాసభలు మహిళా అవగాహన సదస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు ఆరోగ్యశిబిరంలో80 మందికి బీపీ షుగర్ రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు జన వికాస సేవలు అనిర్వచనీయమని ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం బాగుందని గ్రామస్తులు జనవికాసను అభినందించారు చేశారు నిర్వహించడం చాలా బాగుందన్నారు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నటువంటి బాలవికాస యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు కార్యక్రమంలో మెడికేర్ హాస్పిటల్ డాక్టర్ నరేష్ గారి బృందం రాధాకృష్ణ మేనేజ్మెంట్ కిరణ్ రాము శ్రీకాంత్ గ్రామ సెక్రెటరీ స్కూల్ టీచర్స్ నరసింహారావు శిరీష కారోబార్ వినయ్ గ్రామపంచాయతీ సిబ్బంది వెంకన్న విలేజ్ లీడర్ జానకమ్మ భద్రమ్మ పద్మ ఎల్లయ్య గ్రామ పెద్దలు గ్రామప్రజలు పాల్గొన్నారు

# నెల్లికుదురు శివాలయ పునర్నిర్మాణానికి కిసాన్ పరివార్ సంస్థ2 లక్షల విరాళం

## ఆలయ అర్చకులకు నగదును అందజేసిన సీనియర్ జర్నలిస్టు మస్కాపురి సుధాకర్

**తొవ్వ, నెల్లికుదురు, జులై 23**

మండల కేంద్రంలోని పురాతన శివాలయం పునర్నిర్మాణానికి కిసాన్ పరివార్ సంస్థ అధినేత నునావత్ భూపాల్ నాయక్ 2 లక్షల రూపాయలు విరాళం ప్రకటించారు ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని శివాలయంలోసీనియర్ జర్నలిస్టు, మహా న్యూస్ బ్యూరో చీఫ్ మస్కాపురి సుధాకర్ ఆలయ అర్చకులు వెలుకూచి చంద్ర ప్రకాష్ శర్మ, వెంకటేష్ శర్మ లకు గ్రామంలోని పుర ప్రముఖులతో కలిసి రెండు లక్షల నగదును అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం కోసం తనదైన శైలిలో సహాయ సహకారాలు అందించడ



ంతోపాటు రెండు లక్షలు విరాళాన్ని అందించడానికి సహకరించిన సుధాకర్ కు అందించిన భూపాల్ నాయక్ కు గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఆలయ ధ్వజస్తంభ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు పులి ప్రసాద్, వెన్నం భాస్కర్, గొట్టిముక్కుల లక్ష్మన్, మస్కపురి కుమారస్వామి, మస్కపురి చిన్న సుధాకర్, వెలుకూచి రమేష్ శర్మ, వెన్నాకుల శ్రీనివాస్, బచ్చు నాగేశ్వర్ రావు, కొమురవెల్లి సంతోష్,మద్ది భాస్కర్, వల్లపు రాధాకృష్ణ, తదితరులు వున్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన డిసిసి ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి



**యాదాద్రి జిల్లా: వలిగొండ: తోవ్వ ప్రతినిధిబీ జులై 23**

వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన నల్ల సాయిలు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి వారి కుటుంబ సభ్యులకు బుధవారం రూ 5000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంత రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ,మాజీ ఉప సర్పంచ్ సుక్క ముత్యాలు,మచ్చగిరి గుట్ట డైరెక్టర్ కోడితల కరుణాకర్ , కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మహిపాల్ రెడ్డి,పోలపాక నరసింహ,సెవధల్ ఉపాధ్యక్షుడు కోపుల బాలరాజు,పాల సంఘం డైరెక్టరులు రెబస్ సత్తయ్య ,దమెర అంజయ్య,జినుకల మల్లేష్,మద్రి ముత్యాలు, ,చిలకమరి శ్రీనివాస్ చారి,సతిరెడ్డి, జినుకలబాలరాజు, బాలనరసింహ, బత్తిని వెంకట్, ఆకుల మచ్చగిరి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల బిల్లులపై అధికారుల నిర్లక్ష్యం



**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి :జులై 23**

రామన్నపేట మండలంలో ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆరు గ్యారంటీలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కార్యక్రమంలో అధికారులు నిర్లక్ష్య వహిస్తున్నారని ఒకవైపు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే మంత్రులు ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల బిల్లు తమ అకౌంట్లో పడుతుందని చెప్పిన, అధికారులు మాత్రం దాన్ని పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రామన్నపేట మండలంలోని నిదానపల్లి గ్రామంలో రెండో విడత కార్యక్రమంలో బత్తిని కలమ్మ బేస్మెంట్ లెవెల్ ఫోటో 10 వ తారీకు గురువారం పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీరింగ్ ఫోటోలు అప్లోడ్ చేసిన అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటివరకు రెండు వారాలు దాటిన బిల్లు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని లబ్ధిదారులు తెలిపారు.

# బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపు

**తొవ్వ, ప్రతినిధి, ఖానాపూర్, జూలై,23:**



ఖానాపురం మండల కేంద్రంలో ఉదయం 09 :00 గంటలకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో మండల ఉపాధ్యక్షులు.మండల అధికార ప్రతినిధి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లు,మండల ప్రధాన కార్యదర్శిలు, మండల యూత్ నాయకులు,మండల మాజీ ప్రజా ప్రతినిధులు,సొసైటీ చైర్మన్,సొసైటీ డైరెక్టర్లు,మాజీ సర్పంచ్లు,మాజీ ఎంపిటిసిలు, మాజీ జెడ్పిటిసి,మాజీ ఎంపీపీ, మండల నాయకులు.గ్రామ పార్టీ అధ్యక్షులు.మాజీ వార్డ్ మెంబర్లు. కార్యకర్తలు,గ్రామ కమిటీ నాయకులు.బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు. ఈ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకోవాలని కోరారు.

# 18.1 అడుగులకు చేరిన పాకాల సరస్సు ఆనందంలో రైతులు

**తొవ్వ, ప్రతినిధి, ఖానాపూర్, జూలై,23:**





వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. గత రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు సరస్సులోకి క్రమంగా వరద వస్తోంది. వారం క్రితం వరకు పాకాల సరస్సులో 17.6 అడుగుల నీరు ఉండేది. బుధవారం ఉదయానికి 18.1 అడుగులకు చేరుకుంది. పాకాల కింద సుమారు 20 వేలకు పైగా ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ వర్షాలకు ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న అవినీతిపై ఏసీబీ సోదాలను స్వాగతిస్తున్నాం

## ఎస్సి ఎస్టీ బీసీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పొన్నాల యుగేందర్

**తొవ్వ, ప్రతినిధి. జూలై 23**

మహబూబాబాద్ జిల్లాలో ఇటీవల కాలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న అవినీతిపై ఏసీబీ దాడులు జరుగుతున్న దరిమిలా ఎస్సి ఎస్టీ బీసీ సంఘం స్వాగతిస్తుందని ఎస్సి ఎస్టీ బీసీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పొన్నాల యుగేందర్ అన్నారు బుధవారం అయన ప్రకటన ద్వారా తెలియజేస్తూ మహబూబాబాద్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో అనేక రకాల అవినీతి అక్రమాలు జరుతున్నాయని విద్యార్థులకు కనీస సౌకర్యలు లేకుండా మెను పాటించకుండా నాసిరకమైన నాణ్యతలేని ఫుడ్ అందిస్తున్నారని విద్యార్థుల మౌలిక సదుపాయాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చెందారు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో జరిగేటువంటి అవినీతిపై ఏసీబి సోదాలు కొనసాగుతున్నాయి అంటే ఏ రకమైన అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవాలన్నారు మహబూబాబాద్ జిల్లా పరిధిలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో కొంతమంది హెచ్ఎంలు, వార్డెన్లు మహబూబాబాద్ కె పరిమితమైపోయారని సంవత్సరాలుగా ఇక్కడే తిష్ట వేసుకొని కూర్చుని ప్రధానంగా అక్రమ డిప్యుటేషన్ల పేరుతో వారి దందా కొనసాగుతుందన్నారు గత పది సంవత్సరాల కాలంలో చూసుకున్నట్లయితే మహబూబాబాద్ పరిధిలోనే హెచ్ఎంలు వార్డెన్లుగా కొనసాగుతున్న హాస్టలను గుర్తించి అధికారులు వారి రికార్డులను సరేండ్ చేసుకోవాలని అక్రమంగా విద్యార్థుల సొమ్ముకాజేస్తూ అనేక రకాల అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ధనార్జన ధ్యేయంగా పనిచేస్తున్నటువంటి కొంతమంది వార్డెన్లు హెడ్మాస్టర్లు ఉన్నారని వారు అన్నారు వారి ఆస్తులపై విచారణ కొనసాగించాలని ఈ రకమైన అవినీతిపరులను గుర్తించి తప్పు చేసిన వారికి తగిన శిక్ష పడేలాగా చూడాలని వారు ప్రభుత్వాన్ని కోరారు మహబూబాబాద్ ఆశ్రమ పాఠశాలలో జరిగే అవినీతిపై ఏటూర్ నాగారం భద్రాచలం పిఒలు గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు ఈ ప్రాంతంలో పది ఏళ్ల నుండి పనిచేస్తున్న వారిని గుర్తించి వారి అవినీతిని బట్ట బయలు చేయాలని వారు ప్రభుత్వ రంగాన్ని కోరారు విద్యార్థుల పొట్ట కొట్టే ఎంతటి వారినైనా శిక్షించాల్సిందేనని వారు డిమాండ్ చేశారు డిప్యూటీషన్ ల పేరుతో లక్షల రూపాలు చేతులు మారుతున్నాయి అని వారు అన్నారు పెద విద్యార్థుల పరిస్థితి ని గమనించి వారికి అందాల్సిన పౌష్టిక ఆహారం అందించాలని అవినీతి పరులను వదిలిపెట్టొద్దు అని ఇంకా కొన్ని పాఠశాలలు ఉన్నాయి అని వాటిపై సోదాలు చేయాలనీ వారు కోరారు

# సింగరేణి మండలంలో విద్యాసంస్థల బంద్ సంపూర్ణం




**సింగరేణి**

సింగరేణి మండలంలో విద్యార్థుల సమస్యలపై జేఏసీ ఆధ్వర్యంలో ఇచ్చిన పిలుపులో భాగంగా విద్యాసంస్థలు బంద్ సంపూర్ణంగా జరిగింది. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక ,జిల్లా పరిషత్ పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలలో స్వచ్ఛంద బందును పాటించాయి. విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులకు విజ్ఞప్తి చేసి బందులో పాల్గొనే విధంగా కృషి చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు చిలుముల భరత్, డివైఎఫ్ఐ నాయకులు ఆదేర్ల వినయ్ కుమార్లు మాట్లాడుతూ బడ్జెట్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగానికి కేటాయించవలసిన 10 శాతం కేంద్ర ప్రభుత్వం 30% రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వవలసి ఉండగా పాలకులవి పేరు గొప్ప ఊరు దిబ్బలాగా వ్యవహార శైలి ఉన్నదని అందుకే విద్యారంగం ఎక్కడ వేసిన గొంగడి అక్కడ లాగానే ఉన్నదని వారు విమర్శించారు. వేల ఉద్యోగాలు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం కోట్ల కొలువులు ఇస్తున్నామని కేంద్ర ప్రభుత్వం ఎన్ని చెప్పినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎంఈఓ డిఈఓ పోస్టులు ఖాళీగా ఉండటం వలన విద్యారంగం, విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతూ ఉంటే పాలకులు మిన్నకుంటున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ బందులో ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ నాయకులు కిరణ్, సంపత్, ఏ ఐ ఎస్ ఎఫ్ నాయకులు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# బెజ్జంకిలో విద్యా సంస్థల బంద్ విజయవంతం

**విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి**

**ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్**

**,బెజ్జంకి జూలై 23**

సిద్దిపేట జిల్లా బెజ్జంకి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని వామ విద్యార్థి సంఘాల పిలుపు మేరకు బెజ్జంకి మండల కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య బెజ్జంకి మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ మాట్లడుతూ ప్రభుత్వ రంగ సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని ప్రవేట్ కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలనీ,అలాగే ఖాళీగా ఉన్న టీచర్ ఎంఈఓ, డిఈఓ పోస్టులను భర్తీ చేయాలి అలాగే ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో




ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు రొడ్డ చరణ్, వెంకటేష్, సాయి, రాకేష్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకిలో ఫర్టిలైజర్లను తనిఖీ చేసిన ఎస్సై సౌజన్య

## ఇష్టరాజ్యంగా యూరియా అమ్మితే కఠిన చర్యలు - వ్యవసాయ అధికారి సంతోష్




**తెలంగాణ తేజ, బెజ్జంకి జూలై 23**

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో ఎస్ఐ సౌజన్య , మండల అగ్రికల్చర్ అధికారి సంతోష్ ఆధ్వర్యంలో పలు ఫర్టిలైజర్ షాప్ లపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరకు మాత్రమే యూరియా అమ్మాలని, ప్రస్తుతం పంట వేసిన రైతులకు మాత్రమే సరఫరా చేయాలని,ఇష్టరాజ్యంగా యూరియా విక్రయిస్తే పట్టణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ యొక్క తనిఖీలలో భాగంగా మండలంలోని పలు పెట్రోల్ బంకులు, చేపల చెరువులు, చెలిమెడ ఫీట్స్ కంపెనీలను పరిశీలించి ప్రతి యజమానులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# డిటిఎఫ్ సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలి

## డిటిఎఫ్ మండల అధ్యక్షులు అంగోతు భద్రయ్య...



**తొవ్వ,ప్రతినిధి,చెన్నారావుపేటజూలై,23:**

డిటిఎఫ్ సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని డిటిఎఫ్ మండల అధ్యక్షులు అంగోతు భద్రయ్య కోరారు. బుధవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో డిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో డిటిఎఫ్ సభ్యత్వ నమోదును చేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం జరిగే పోరాటంలో డిటిఎఫ్ ముందుండి పోరాడుతుందన్నారు. దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న డిటిఎఫ్ లో ఉపాధ్యాయులు సభ్యులుగా చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్. ఉమాశంకర్, జిల్లా కౌన్సిలర్లు యాకన్న, కొమురయ్య, వెంకటేశ్వర్లు, కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయనీలు, తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల కాపరి దారుణ హత్య

**తొవ్వ, కేసముద్రం, జూలై 23:**

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో గొర్రెల కాపరి దారుణ హత్యకు గురయ్యారు. ఎస్సై కరుణాకర్ తెలిపిన కథనం ప్రకారం కంకాల ఉప్పలయ్య బుధవారం గొర్లను కాయడానికి వెళ్లిన నేపథ్యంలో గ్రామ శివారులో భూ తగాదాల విషయంలో కొనుగొండ మల్లేష్ అనే వ్యక్తి తన బావ అయిన కంకాల ఉప్పలయ్యను ఇనుప రాడ్ తో కొట్టి హత్య చేశాడని, ఈ మేరకు మృతి చెందిన వ్యక్తి భార్య ఆయన కంకాల కోమల ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయడం జరిగిందని,ఈకార్యక్రమంలో డిఎస్పీ తిరుపతిరావు, సీఐ సర్వయ్య, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టడం జరిగిందని తెలిపారు.

# లోలెవెల్ కాజ్ వేల వద్ద రాకపోకలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## తొర్రూరు ఆర్డీవో గణేష్



**తొవ్వ, నెల్లికుదురు, జూలై 23**

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న లో లెవెల్ కాజ్ వే ల వద్ద ప్రజల రాకపోకలపై మండల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని తొరూరు ఆర్డీవో గణేష్ అధికారులకు సూచించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు దృష్ట్యా బుధవారం మండలంలోని రాజుల కొత్తపల్లి, రావిరాల గ్రామాల వద్ద ఉన్న లో లెవెల్ కాజ్ వే లను స్థానిక తహసీల్దార్ చందా నరేష్, ఎంపీడీవో సింగారపు కుమార్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు చెరువులు తెగి కాజు వేల వద్ద భారీగా వరద నీరు చేరి ప్రజలు రాకపోకలకు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రాత్రి వేళల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పరిశీలనలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు యాకూబ్ రెడ్డి, అరుణ, ఉద్యోగులు రాజు తదితరులున్నారు.

# ఇటు రాకపోకలు బంద్

## -బార్గెట్లు ఏర్పాటు చేసిన పోలీసులు



**తొవ్వ,గార్ల జులై 23**


ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గార్ల పాకాల ఏరు పొంగడంతో గార్ల పోలీసులు బార్గెట్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు. ఇకనుండి రాంపురం, మద్దివంచ గ్రామలతో పాటు చుట్టుపక్కల దాదాపు 20 తండాల ప్రజలకు మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఇటుగా ఎవరు ప్రయాణం చేయవద్దని, చేపలవేట కోసం సాహసాలు మానుకోవాలని, మీ రక్షణకోసమే పోలీసులు శ్రమిస్తున్నారని గార్ల బయ్యారం సీఐ రవికుమార్, గార్ల ఎస్సై షేక్ రియాజ్ పాషా అన్నారు.



## రాజాసాబ్‌తో ఆటపాట

అగ్ర కథానాయికలు ఐటెంసాంగ్స్‌లో నర్తించే ట్రెండ్ చాలా కాలం క్రితమై మొదలై ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే పలువురు నాయికలు ప్రత్యేకగీతాల్లో మెరిశారు. వారిలో మిల్కీబ్యూటీ తమన్నా ముందు వరుసలో ఉంటుందని చెప్పొచ్చు. ఇప్పటికే ఈ భామ చాలా సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసింది. జైలర్‌లో 'కావాలయ్యా', హిందీ 'స్త్రీ-2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్..' ఐటెంసాంగ్స్ ఈ మధ్య బాగా పాపులర్ అయ్యాయి. తాజాగా ఈ భామ మరోమారు స్పెషల్‌సాంగ్‌కు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ప్రభాస్ నటిస్తున్న హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ది రాజాసాబ్'లో తమన్నా ప్రత్యేకగీతంలో ఆడిపాడనుందని సమాచారం. ఇందుకోసం సంగీత దర్శకుడు తమన్ హుషారైన బీట్‌తో ట్యూన్ సిద్ధం చేస్తున్నారని అంటున్నారు. 'ది రాజాసాబ్' చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రస్తుతం తమన్నా హిందీలో మూడు చిత్రాల్లో నటిస్తున్నది. ఈ ఏడాది తెలుగులో ఆమె 'ఓదెల-2' చిత్రంతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.

## అసుర సంహారంలో నరసింహ



భాగవతంలో ప్రసిద్ధిపొందిన ప్రహ్లాదుడు, హిరణ్యకశిపుడు వృత్తాంతం ఆధారంగా రూపొందిస్తున్న యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ 'మహావతార్ నరసింహ'. అశ్విన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హొంబలే ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. 'మహావతార్' సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రూపొందిస్తున్న తొలి సినిమా ఇది. శ్రీమహావిష్ణువు దశావతారాలను ఆవిష్కరిస్తూ ఈ ఫ్రాంఛైజీలో వరుసగా సినిమాలు నిర్మాణం కానున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం 'మహావతార్ నరసింహ' ట్రైలర్‌ను విడుదల చేశారు. హిరణ్యకశిపుడు బ్రహ్మదేవుడి వరం కోసం చేసే తపస్సుతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను పంచింది. అపర విష్ణు భక్తుడైన ప్రహ్లాదుడు తన తండ్రి హిరణ్యకశిపుడిని ప్రతిఘటించడం, ప్రహ్లాదుడిని రక్షించడానికి నరసింహావతారంలో విష్ణువు అరుదెంచే సన్నివేశాలతో ట్రైలర్ ఆసాంతం విజువల్ వండర్‌లా సాగింది. ఈ ఇతిహాస గాథలోని ప్రతి ఫ్రేమ్‌ను గొప్పగా ఆవిష్కరించామని, మన భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుకోవాలనే ప్రయత్నమిదని, నరసింహ గర్జన వస్తున్నదని నిర్మాత శిల్పా ధావన్ పేర్కొన్నారు. ఈ సినిమా 3డీ వెర్షన్‌లో ఐదు భారతీయ భాషల్లో ఈ నెల 25న విడుదలకానుంది.

## సుహాస్ సినీ ప్రయాణం స్ఫూర్తిదాయకం

'ప్రతి ఒక్కరి సక్సెస్‌ఫుల్ లైఫ్‌లో తల్లి, భార్య ముఖ్య పాత్రలు పోషిస్తారు. వారి అనుబంధం తాలూకు భావోద్వేగాలను ఆవిష్కరిస్తూ ఈ సినిమా అందరికి కనెక్ట్ అవుతుంది' అన్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓ భామ అయ్యో రామ' ఈ నెల 11న విడుదలకానుంది. రామ్ గోధల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి హరీష్ నల్ల నిర్మాత. బుధవారం జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కు హీరో మంచు మనోజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. సుహాస్ తనకు సోదరుడిలాంటివాడని, యూట్యూబ్ నుంచి హీరోగా ఎదిగిన ఆయన ప్రయాణం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ఈ సినిమా తనకొక జీవితకాల జ్ఞాపకమని, ఇందులో అతిథి పాత్రల్ని పోషించిన దర్శకులు హరీశ్‌శంకర్, మారుతిలు ఎంతో సహకారం అందించారని దర్శకుడు రామ్ గోధల పేర్కొన్నారు. ఈ సినిమా కోసం ప్రతిభావంతులైన సాంకేతిక బృందం పనిచేశారని, సుహాస్ పర్ఫార్మెన్స్ మరోస్థాయిలో ఉంటుందని నిర్మాత హరీష్ నల్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



## భాగ్యనగరిలో 'ది ప్యారడైజ్' యాక్షన్



నాని కథానాయకుడిగా హైదరాబాద్ నేపథ్యంలో రూపొందుతున్న పీరియాడిక్ చిత్రం 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. భారీ సెట్‌లో ఫైట్ మాస్టర్ రియల్ సతీష్ నేతృత్వంలో భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను తెరకెక్కిస్తున్నారు. ఇందులో విదేశీ స్టంట్ మాస్టర్స్ కూడా పాల్గొంటున్నారని, సినిమాకిది హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. తన వారి రక్షణ కోసం ఆధిపత్య వ్యవస్థపై ఓ సామాన్యుడి తిరుగుబాటు నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై హైప్‌ను క్రియేట్ చేశాయి. వచ్చే ఏడాది మార్చి 26న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, రచన-దర్శకత్వం: శ్రీకాంత్ ఓదెల.

## ముచ్చటగా మూడోసారి

అగ్ర కథానాయిక రష్మిక మందన్న కెరీర్‌లో 'పుష్ప' సిరీస్ చిత్రాలు చాలా ప్రత్యేకం. శ్రీవల్లి పాత్ర ఆమెకు దేశవ్యాప్తంగా తిరుగులేని ఫాలోయింగ్‌ను తెచ్చిపెట్టింది. ముఖ్యంగా మాస్ ప్రేక్షకులకు ఆ క్యారెక్టర్ బాగా రీచ్ అయింది. కథానాయకుడు పుష్పరాజ్‌తో సమానంగా శ్రీవల్లి పాత్ర పాపులర్ అయిందనడం అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలో ఈ సూపర్‌హిట్ కాంబో మరోసారి రిపీట్ కాబోతున్నదని సమాచారం. అల్లు అర్జున్‌తో రష్మిక మందన్న ముచ్చటగా మూడోసారి జోడీకట్టబోతున్నదని ప్రచారం జరుగుతున్నది. వివరాల్లోకి వెళితే..అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో భారీ పాన్ వరల్డ్ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. సైన్స్ ఫిక్షన్ కథాంశమిదని సమాచారం. భారీ వ్యయంతో సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నెలలోనే సెట్స్‌మీదకు వెళ్లనుందని చెబుతున్నారు. ఈ సినిమాలో రష్మిక మందన్నను కథానాయికగా ఖరారు చేయబోతున్నారని తెలిసింది. 'పుష్ప' సిరీస్ చిత్రాలతో బన్నీ, రష్మిక మందన్న హిట్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకోవడంతో..అదే సెంటిమెంట్‌ను కొనసాగించాలన్నది మేకర్స్ ఆలోచనగా చెబుతున్నారు.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146